క్లుప్తంగా

ఉత్సాహంగా విజ్ఞాన శిబిరం



తయారు చేసిన మట్టి బొమ్మలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

సబ్బవరం: సబ్బవరం శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం కొనసాగుతుంది. గ్రంథాలయ అధికారి వి. శిరీష ఆధ్వర్యంలో ఆదివారం హ్యాండ్ క్రాఫ్ట్‌లో భాగంగా విద్యార్థులు మట్టితో పలు రకాల బొమ్మలు తయారు చేసి వారి ప్రతిభ కనబరిచారు. మట్టితో బొమ్మలు తయారు చేయడం వల్ల పర్యావరణానికి హాని కలగదన్నారు.విజేతలకు ముగింపు రోజు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

రైలు నుంచి జారి పడి వ్యక్తి మృతి



మృతి చెందిన లాబా గడబ

గోపాలపట్నం: గుర్తు తెలియని రైలు నుంచి జారిపడిన ప్రమాదంలో ఒడిశాకు చెందిన వ్యక్తి వ్యక్తి మృతి చెందాడు. కొత్తపాలెం రైల్వే బ్రిడ్జ్ వద్ద చోటు చేసుకున్న ఘటనకు సంబంధించి దువ్వాడ రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఒడిశా రాష్ట్రం జయంతిగిరికి చెందిన లాబా గడబ(39) గుర్తు తెలియని ట్రైన్‌లో ప్రయాణిస్తూ ప్రమాదవశాత్తు జారి పడడంతో మృతి చెందాడు. దువ్వాడ రైల్వే పోలీసులు మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. ఈ వ్యక్తికి సంబంధించినవారు దువ్వాడ రైల్వే పోలీసులను సంప్రదించాలని కోరారు.

ఆంజనేయస్వామికి వెండి కిరీటం బహూకరణ



కిరీటాన్ని ఏఈవోకు అందజేస్తున్న దాత రమేష్

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన సింహగిరి మెట్లమార్గంలోని ఆంజనేయస్వామికి వెండికిరీటాన్ని అడవివరానికి చెందిన ఎం.రమేష్ అనే దాత బహూకరించారు. 990 గ్రాముల వెండితో తయారు చేయించిన కిరీటాన్ని ఆదివారం ఆలయంలో ఏఈవో ఇజిరోతు శ్రీనివాసరావుకు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ కనకరాజు, సిబ్బంది సాంబ పాల్గొన్నారు.

నేరాలకు దూరంగా ఉండండి



రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ శ్రీనివాసరావు

సీతమ్మధార: పోర్ట్ టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆదివారం రౌడీ షీటర్లకు సీఐ శ్రీనివాసరావు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎటువంటి నేరాల జోలికి పోకుండా సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. కుటుంబ సభ్యులతో కలిసి హాయిగా జీవించాలని, ఎలాంటి తగాదాల్లో తలదూర్చినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలీస్ నిఘా ఎల్లప్పుడూ ఉంటుందని గుర్తుంచుకుని మంచిగా నడుచుకోవాలని హితవు పలకారు. కార్యక్రమంలో ఎస్ఐలు మోహన్‌రావు, గౌరి, వెంకటరావు, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

ద్వారకా పోలీస్ స్టేషన్‌లో..

ద్వారకా జోన్ పోలీస్ స్టేషన్‌లో రౌడీ షీటర్లకు సీఐ సింహాద్రినాయుడు కౌన్సెలింగ్ చేశారు. రౌడీ షీటర్ల దినచర్య గురించి అడిగి తెలుసుకున్నారు. గొడవలు, అల్లర్లకు పాల్పడితే చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. మంచిగా జీవించాలని సీఐ సూచించారు. కౌన్సెలింగ్ అనంతరం సిబ్బంది రౌడీ షీటర్లను ఇళ్లకు అప్పగించారు.

ఆచార్య అల్లం అప్పారావు మృతికి సంతాపం

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం పూర్వ ఆచార్యుడు అల్లం అప్పారావు మృతికి యూపీఎస్సీ పూర్వ సభ్యులు ఆచార్య కె.ఎస్.చలం సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మృతి పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేశారు. వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. అర్ధ శతాబ్దంకు పైగా తనకు ఆచార్య అల్లం అప్పారావుతో ఉన్న అనుబంధాన్ని ఈ సందర్భగా గుర్తు చేసుకున్నారు. విభిన్న పదవులను ఆయన సమర్థవంతంగా నిర్వహించి పదవులకు వన్నె తెచ్చారని కొనియాడారు.

ప్రమాదమని తెలిసినా..!



ఎన్టీపీసీ సమీపంలో రోడ్డు పక్కన నిలిపిన లారీలు



వాడచీపురుపల్లి రహదారిలో నిలిపిన బొగ్గు లారీలు

- రోడ్ల వెంబడి లారీల పార్కింగ్
- తరచూ ట్రాఫిక్ సమస్య
- రాత్రివేళ గుర్తించ లేక ప్రమాదాలు
- ఇబ్బంది పడుతున్న వాహన దారులు

పరవాడ: నిత్యం రద్దీగా ఉండే రహదారులపై భారీ వాహనాలతో పాటు లారీలను ఇష్టానుసారంగా నిలుపుతున్నారు. ఫలితంగా ప్రయాణికులు, వాహన చోదకులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. తరచూ ప్రమాదాలు కూడా సంభవిస్తున్నాయి. అయినా వారిలో చలనం లేదు. కట్టడి చేయాల్సిన పోలీసులు కూడా చోద్యం చూస్తున్నారు.

ఇదీ పరిస్థితి

భారీ వాహనాలతో పాటు కార్మికులు, ఉద్యోగుల రాకపోకలతో లంకెలపాలెం-పరవాడ, పరవాడ-వాడచీపురుపల్లి, ఊటగెడ్డ కూడలి-సోమునాయుడుపాలెం రహదారులు నిత్యం రద్దీగా ఉంటాయి. ఈ రహదారులపై నిత్యం బొగ్గు, బూడిద లారీలతో పాటు ఐరన్, సిమెంటు వంటి మెటీరియల్‌తో భారీ వాహనాల లెక్కకు మించి రాకపోకలు సాగిస్తున్నాయి. ఈ రోడ్లు నిత్యం రద్దీగా ఉంటాయి. ఇక సుదూర ప్రాంతాల నుంచి వస్తున్న భారీ వాహన సిబ్బంది అల్పాహారం, భోజనం, తాగునీటి వంటి అవసరాలు తీర్చుకోవడానికి రహదారుల పక్కనున్న హోటళ్లు, భోజనశాలలు, పాన్ షాపుల వద్ద భారీ వాహనాలను గంటల తరబడి నిలపడంతో ప్రయాణికులకు అవస్థలు తప్పడం లేదు. ఇరుకు రోడ్లపై పగలు, రాత్రి తేడా లేకుండా భారీ వాహనాలు నిలపడంతో బస్సులు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు తప్పించుకోవడం గగనమవుతోంది. దీంటో ట్రాఫిక్ సమస్య తరచూ ఉత్పన్నమవుతోంది. రాత్రి సమయాల్లో రోడ్ల పక్కన నిలిపిన భారీ వాహనాలను గుర్తించడం కష్టతరంగా ఉంటుందని ప్రయాణికులు వాపోతున్నారు. నిలిపిన వాహనాలకు కనీసం సిగ్నల్ ల్యాంపులు వెలిగేటట్టు చర్యలు తీసుకోకపోవడంతో ప్రమాదాల బారిన పడుతున్నామని వాపోతున్నారు. ఎన్టీపీసీ, హిందూజా, ఎస్ఈజెడ్ పరిశ్రమలకు రాకపోకలు సాగించే భారీ వాహనాలతోనే తరచూ ఇబ్బందులు పడుతున్నామని చెబుతున్నారు. రోడ్లపై అనధికార పార్కింగ్‌కు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం



రహదారి నిబంధనలు పాటించని వాహనదారులపై చట్టపరమైన చర్యలు తప్పవు. రద్దీగా ఉండే ప్రధాన రహదారులపై భారీ వాహనాలు గంటల తరబడి పార్కింగ్ చేసిన వారిని గుర్తించి కేసులు నమోదు చేస్తాం. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు తప్పవు. అనధికార పార్కింగ్‌కు పాల్పడడం చట్టరీత్యా నేరమని గుర్తించాలి.

– పి.ఈశ్వరరావు, సీఐ, పరవాడ

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



అప్పన్న ఉత్సవమూర్తులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7నుంచి 8గంటల వరకు స్వర్ణపుష్పార్చన ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అలంకరించి కల్యాణ మండపంలోని వేదికపై అధిష్ఠంపజేశారు. 108 స్వర్ణసంపెంగ పుష్పాలతో స్వామికి అష్టోత్తర శతనామావళి నిర్వహించారు. అర్చకుడు పెదరాజు తదితరులు పూజ చేశారు. ఏఈవో ఇజిరోతు శ్రీనివాసరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వైభవంగా నిత్యకల్యాణం

వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్ఠంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం,జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

పాలిసెట్‌లో ప్రణవ్‌కు 230వ ర్యాంకు



ఆడారి షణ్ముఖ్ శ్రీ ప్రణవ్

సబ్బవరం: మండలంలోని బంగారమ్మపాలెం గ్రామానికి చెందిన ఆడారి షణ్ముఖ్ శ్రీ ప్రణవ్ శనివారం విడుదలైన పాలిసెట్ ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో 230వ ర్యాంక్ సాధించాడు. తండ్రి నాయుడు ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తుండగా తల్లి విజయ లక్ష్మి అన్ ఎయిడెడ్ స్కూల్‌లో టీచర్‌గా పనిచేస్తుంది. తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే తాను ఈ ర్యాంకు సాధించానని ప్రణవ్ చెప్పాడు.

గురజాడ కళాక్షేత్రం పునః ప్రారంభం నేడు



కస్టమర్ మీట్-2023కు సిద్ధమైన గురజాడ కళాక్షేత్రం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లోని గురజాడ కళాక్షేత్రం సోమవారం పునః ప్రారంభం కానుంది. ఈ కళాక్షేత్రంలో స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం అధికారిక, ఉద్యోగుల కుటుంబీకుల శుభకార్యాలు, సభలు, సమావేశాలకు వేదికగా ఉపయోగపడుతోంది. కరోనా తీవ్రంగా ఉన్న పరిస్థితుల్లో నగరంలోని ఆస్పత్రుల్లో బెడ్లు అందుబాటులో లేకపోవడంతో గురజాడ కళాక్షేత్రంను 200 బెడ్ల కోవిడ్ సెంటర్‌గా మార్పు చేశారు. అప్పటి నుంచి కళాక్షేత్రం ఉద్యోగులకు, యాజమాన్యం ఫంక్షన్లకు అందుబాటులో లేకుండా పోయింది. ఉద్యోగులు, కార్మిక సంఘాల విజ్ఞప్తి మేరకు సోమవారం పునః ప్రారంభించనున్నారు. వచ్చేనెల ఒకటో తేదీ నుంచి ఉద్యోగులకు అందుబాటులోకి రానుంది. ఇందులో భాగంగా సోమవారం ఈ క్షేత్రం వేదికగా స్టీల్‌ప్లాంట్ మార్కెటింగ్ విభాగం ఆధ్వర్యంలో కస్టమీర్ మీట్-2023 జరగనుంది.

సాముగరిడీ శిక్షణకు విశేష స్పందన



మెమెంటోలతో క్రీడాకారులు, గ్రామ కమిటీ సభ్యులు

కంచరపాలెం: గొల్లకంచరపాలెం శ్రీరామా సేవా సమాజంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా నిర్వహించిన సాముగరిడీకి మంచి ఆదరణ లభించిందని గ్రామాధ్యక్షుడు పల్లా సత్యనారాయణ తెలిపారు. సమాజం ఆధ్వర్యంలో ఆదివారం సీతారామ కల్యాణ మండపంలో జరిగిన వేడుకల్లో సాముగరిడి గురువు సానబోయిన అప్పలరాజును గ్రామ కమిటీ సభ్యులు, క్రీడాకారులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ అంతరించి పోతున్న క్రీడల్లో సాముగరిడి ఒకటని, దానిని నేటి విద్యార్థులకు నేర్పించాలనే తపన ఉందన్నారు. వేసవిలో అనేక మంది క్రీడాకారులు సాముగరిడి నేర్చుకోవడం అభినందనీయమన్నారు. పల్లా సత్యనారాయణ సొంత నిధులతో క్రీడాకారులకు మెమెంటోలు, ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో వై.వెంకటరావు, పి.వెంటకరమణ, పి.పెంటారావు, ఎస్.సంపత్, డి.రమణ, ఎస్.శంకరరావు, కె.వి.అప్పారావు, నూనెల రామారావు, పల్లా వెంకటరావు, కోనా రాము, పల్లా ధర్మారావు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కె.పి.రత్నాకర్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకోవాలి



విద్యార్థులతో డీజీఎం ఉమా మహేశ్వరరావు తదితరులు

గాజువాక: విద్యార్థులు నిర్దిష్టమైన లక్ష్యాలను ఏర్పాటు చేసుకుని వాటిని సాధించడానికి ప్రణాళిక ప్రకారం కృషి చేయాలని విశాఖ స్టీల్‌ప్లాంట్ డీజీఎం ఎస్.ఉమామహేశ్వరరావు సూచించారు. గాజువాక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో ఆయన మాట్లాడారు. లక్ష్యాలను ఏ విధంగా నిర్దేశించుకోవాలన్న అంశంపై పలు సూచనలు చేశారు. పిల్లల ఆలోచనలకు వారి తల్లిదండ్రులు కూడా ప్రోత్సాహం ఇవ్వాలన్నారు. విద్యతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో కూడా ప్రతిభకనబరిచేలా సహకరించాలన్నారు. ఉన్నత చదువులు పూర్తి చేసిన వారికి పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలు గ్రంథాలయంలో అందుబాటులో ఉన్నాయన్నారు. అనంతరం చిన్నారులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో అగనంపూడి అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు బలిరెడ్డి సత్యనారాయణ, గ్రంథాలయాధికారి బి.చంద్రకళ, తదితరులు పాల్గొన్నారు.


ఇతరుల కోసం సమయం కేటాయించండి



వైట్‌బోర్డులు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్సీ శర్మ

సీతంపేట: విజయానికి చదువు ఒక్కటే కొలమానం కాదని, సమాజంలో ఇతరుల కోసం కొంత సమయం కేటాయించడమే నిజమైన సక్సెస్ అని మాజీ ఎమ్మెల్సీ ఎం.వి.ఎస్.శర్మ అన్నారు. ఆసరా చారిటబుల్ సొసైటీ 9వ వార్షికోత్సవ సభ ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ ఆసరా సేవలను కొనియాడారు. పలు ప్రాంతాల్లో ఆసరా నిర్వహిస్తున్న ట్యూషన్ సెంటర్లకు ఆయన చేతుల మీదుగా వైట్‌బోర్డులు అందజేశారు. ఆసరా అధ్యక్షురాలు సునీత మాట్లాడుతూ 2014 నుంచి ఇప్పటి వరకు ఎన్నో సేవా కార్యక్రమాలతో తమ సొసైటీ ముందుకు వెళ్తోందన్నారు. నగరంలో ఆరు చోట్ల కుట్టు శిక్షణ కేంద్రాలు స్థాపించి ఎంతో మందికి ట్రైనింగ్ ఇస్తున్నట్టు తెలిపారు. జువనైల్ హోంలో బ్రిడ్జి స్కూల్ ఏర్పాటు చేసి విద్యార్థులకు చదువుతోపాటి నైతిక విలువలు తెలిపే కథలు నేర్పుతున్నట్టు చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక, నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

వాల్తేర్ డిపో సందర్శన



డ్రైవర్లు, కండక్టర్లతో మాట్లాడుతున్న అప్పలనాయుడు

ఎంవీపీ కాలనీ: డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజినీర్ బి.అప్పలనాయుడు ఆదివారం వాల్తేర్ డిపోను సందర్శించారు. డిపోలోని పలు యూనిట్లను పరిశీలించి డ్రైవర్లు, కండక్టర్లతో పాటు సిబ్బందికి పలు సూచనలు చేశారు. ట్రైనింగ్‌కు అనుగుణంగా డ్రైవర్లు, కండక్టర్లు మెయింటెనెన్స్ పక్కాగా చేయాలని, మెకానిక్‌లు బస్సుల కండిషన్‌ను నిత్యం పర్యవేక్షించాలని సూచించారు. ప్రయాణికులకు అందించే సేవల్లో ఎలాంటి పొరపాట్లు దొర్లకుండా చర్యలు తీసుకోవాలన్నారు. డిపో మేనేజర్ సుధాకర్, అసిస్టెంట్ ఇంజినీర్ అప్పలరాజు, సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన

సింహాచలం: జీవీఎంసీ 97వవార్డు సుజాతనగర్ సమీపంలోని వెంకటాద్రి కాలనీలో రూ.18లక్షల జీవీఎంసీ నిధులతో కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులకు కార్పొరేటర్ శానాపతి వసంత ఆదివారం శంకుస్థాపన చేశారు. పనులు వేగవంతం చేసి త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో శానాపతి శంకరరావు, వెంకటాద్రినగర్ కాలనీ అధ్యక్షుడు విద్యాసాగర్, సెక్రటరీ రాజేశ్వరి, నాయుడు, సూరిబాబు, కృష్ణవేణి, మహేష్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

యూనివర్సిటీ ఉద్యోగుల సమావేశం నేడు

మద్దిలపాలెం: రాష్ట్రంలో యూనివర్సిటీ బోధనేతర సిబ్బందికి ప్రభుత్వ ఉద్యోగుల మాదిరి గా పదవీ విరమణ వయస్సు 62 సంవత్సరా లు అమలు చేయాలని కోరుతూ సోమవారం జగదాంబ సీఐటీయూ కార్యాలయంలో ఆల్ ఇండియా యూనివర్సిటీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరగనుంది. ఈ సమావేశా నికి ముఖ్యఅతిథిగా సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్.నర్సింగరావు, మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు హాజరవుతారని యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు.

అమెరికన్ వర్సిటీలతో కలిసి ఏయూ ఎంఎస్ కోర్సులు

మద్దిలపాలెం: అమెరికన్ యూనివర్సిటీలతో కలిసి రెండు ప్రతిష్టాత్మక అంతర్జాతీయ సహకార మాస్టర్ ప్రొగ్రాంలను ప్రారంభించినట్టు ఏయూ వీసీ ఆచార్య పీజీవీడీ ప్రసాదరెడ్డి తెలిపారు. స్క్రాంటన్ వర్సిటీలో రెండేళ్ల ఎంఎస్ బిజినెస్ అనలిటిక్స్ కోర్సును ఏయూలో ఆన్‌లైన్‌లో ఏడాది, యూఎస్‌లో ద్వితీయ సంవత్సరం చదివే అవకాశం ఉంటుందన్నారు.

- ఎంఎస్ ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్‌ను మిస్సౌరి స్టేట్ యూనివర్సిటీతో కలిసి ఏయూ సంయుక్తంగా అందిస్తుందని వీసీ తెలిపారు. ఇక్కడ విద్యార్థులు ఆంధ్రా యూనివర్సిటీలో ఆన్‌లైన్‌లో మొదటి సంవత్సరం, యూఎస్ఏలో రెండో సంవత్సరం చదువుతారన్నారు. రెండూ స్టెమ్‌ల కోర్సుల వల్ల విద్యార్థులు ఎంఎస్ కోర్సులను పూర్తి చేసిన తర్వాత మూడేళ్లపాటు ఓపీటీకి అర్హులన్నారు. వారు యూఎస్ఏలో పని చేసుకోవచ్చని చెప్పారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు 94401 91968 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఘనంగా వేద గాయత్రీదేవి ఆలయ వార్షికోత్సవం



మహాపూర్ణాహుతిలో పాల్గొన్న స్వరూపానందేంద్ర సరస్వతి, స్వాత్మానందేంద్ర సరస్వతి, ఎమ్మెల్యే అదీప్‌రాజ్

సింహాచలం: జీవీఎంసీ 94వ వార్డు పరిధి నాయుడుతోటలోని వేద గాయత్రీదేవి ఆలయ ప్రథమ వార్షికోత్సవ వేడుకలు రెండోరోజు ఆదివారం పూర్ణాహుతితో ఘనంగా ముగిశాయి. విశాఖ శ్రీశారదాపీఠాధిపతులు స్వరూపానందేంద్ర సరస్వతి, స్వాత్మానందేంద్ర సరస్వతి వేడుకలో పాల్గొని పూర్ణాహుతి కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆధ్యాత్మిక భావం ఎంతో గొప్పదని, భక్తులంతా ఆధ్యాత్మిక మార్గంలో పయనించాలని స్వామీజీలు అనుగ్రహ భాషణం చేశారు. ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు అమ్మవారికి నిత్యార్చన, అగ్నికార్యం, సహస్ర గాయత్రీ మంత్ర హవనం, ఉపదేవతా సహిత నవగ్రహ మంత్ర సూక్త హవనాలు, మహాపూర్ణాహుతి ఘనంగా నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం భారీ అన్నసమారాధన చేపట్టారు. ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, ద్రోణంరాజు శ్రీవాత్సవ, ఆలయ ధర్మకర్త రాపర్తి కన్నా, గాయత్రీ బ్రాహ్మణ సంక్షేమ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల సమస్యపై ఎమ్మెల్యే సమీక్ష



అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

సింహాచలం: జీవీఎంసీ 97వవార్డు పరిధి కార్మికనగర్, అంబేడ్కర్ నగర్‌లో ఇళ్ల స్థలాల సమస్యపై ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఆదివారం ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, పెందుర్తి తహసీల్దార్ ఆనంద్‌కుమార్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ ప్రాంతంలో లబ్ధిదారులకు కేటాయించిన స్థలాల సమస్యపై అధికారులతో చర్చించారు. సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో 97వవార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు మెంటి మహేష్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



ఆధ్యాత్మిక పుస్తకాలు అందజేస్తున్న సత్యనారాయణ, గ్రంథాలయ అధికారి నరసింహం

సింహాచలం: పర్యావరణ పరిరక్షణ ప్రతి సామాజిక బాధ్యత అని ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త, జ్యోతిష్యపండితుడు మందారపు సత్యనారాయణ అన్నారు. అడవివరం గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా ఆదివారం పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న మందారపు సత్యనారాయణ పర్యావరణ పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. అలాగే పలు వ్యర్థాలతో వివిధ రకాల ఆకృతులు తయారు చేయడంపై శిక్షణ ఇచ్చారు. ఆధ్యాత్మిక పుస్తకాలను విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ రీడర్స్ ఫోరం కమిటీ అధ్యక్షుడు బి.బి.రాజేంద్రప్రసాద్, గ్రంథాలయాధికారి ఎన్.వి. నరసింహం, ఆయుర్వేద వైద్యుడు డి.కామేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటీకరణతో ఉక్కు కార్మికుల భవిష్యత్తు అంధకారం



829వ రోజు దీక్షా శిబిరంలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరిస్తే కార్మికుల భవిష్యత్తు అంధకారమవుతుందని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్ ప్లాంట్ ఆర్చి వద్ద ఆదివారం 829వ రోజు ఉక్కు రిలే నిరాహార దీక్షలు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జరిగాయి. ఈ దీక్షలో కాంట్రాక్ట్ వర్కర్స్ అధిక సంఖ్యలో పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. 30 ఏళ్లుగా కార్మికులు ఆహోరాత్రులు శ్రమించి స్టీల్‌ప్లాంట్ ఆస్తులను దేశంలో ఆగ్రగామిగా నిలిపితే, నేడు పరిశ్రమను ప్రైవేట్ వ్యక్తులకు అమ్మేయాలని అనుకోవడం దుర్మార్గమైన చర్య అన్నారు. కార్మికుల హక్కులు, సదుపాయాలు కొనసాగాలంటే స్టీల్ ప్లాంట్ ప్రభుత్వ రంగంలోనే కొనసాగాలని డిమాండ్ చేశారు. ఇందు కోసం కార్మికులు, ఉక్కు నిర్వాసితులు ఉక్కు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసి ప్రజా ఉద్యమంగా మలచాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, కాంట్రాక్ట్స్ వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు మంత్రి రవి, ఎల్.సోంబాబు, నందికి తాతరావు, మరళీ కృష్ణ, మంగరాజు, కృష్ణ, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

ఘనంగా ఎర్నిమాంబ జాతర



ప్రత్యేక అలంకరణలో ఎర్నిమాంబ అమ్మవారు



ఆలయం వద్ద భక్తుల సందడి

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు పరిధి జ్ఞానాపురం, అల్లిపురం ప్రజల ఇలవేల్పు ఎర్నిమాంబ అమ్మవారి జాతరను దేవదాయ శాఖ, ఆయా సంక్షేమ సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం 5 గంటల నుంచి ఆలయ దర్శనాలకు క్యూలైన్లలో బారులు దీరిన భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అర్చకుడు పులఖండం శ్రీకాంత్‌శర్మ, ఆలయ పూజారమ్మ వాసుపల్లి విజయ నేతృత్వంలో ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ శ్రీధర్ దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. నగరం నుంచే కాకుండా ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి వచ్చిన భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం మూలవిరాట్‌ను, సుమారు 35 అమ్మవారి ప్రతిమలను భక్తులు దర్శించుకున్నారు. అనంతరం అనుపోత్సవం ఘనంగా నిర్వహించారు. జాతరలో నేల వేషాలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. దేవదాయశాఖ ఈవో బాబ్జా, ఆయా సంఘాల ప్రతినిధులు, ఆలయ సిబ్బంది జాతరను పర్యవేక్షించారు.

నర్సింగ్ విద్యార్థిని అదృశ్యం



మావూరి వీరమణి

మర్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ యువతి అదృశ్యమైన ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. మావూరి వీరమణి కుటుంబంతో కలిసి బర్మాక్యాంప్‌లో నివసిస్తోంది. నర్సింగ్ మొదటి సంవత్సరం పూర్తయింది. ఈ నెల 15న తల్లిదండ్రులతో కాలేజీకి వెళ్తున్నానని చెప్పి తిరిగి ఇంటికి చేరుకోలేదు. దీంతో యువతి బావ నరేంద్ర కంచరపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఏఎస్ఐ ఆదిరాజు కేసు దర్యాప్తు చేపట్టారు.

పట్టాభిరెడ్డితోటకు చెందిన వాచ్‌మెన్

కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. పట్టాభిరెడ్డితోటకు చెందిన వెన్నెల సింహాచలం ఈ నెల 14వ తేదీ రాత్రి నుంచి కనిపించలేదు. సదరు వ్యక్తి గతేడాది వరకు ఏలూరులో ఉండి, విశాఖకు వచ్చాడు. పట్టిభిరెడ్డి తోటలో కొత్తగా కడుతున్న అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తుంటారు. అతడి అన్నయ్య వెన్నెల రామారావు కంచరపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. హెడ్ కానిస్టేబుల్ ప్రకాశరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.